# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## కల్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూలై 2 : సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అర్హులకు వివిధ సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తున్నట్లు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. నియోజకవర్గానికి సంబంధించి అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్లకు చెందిన సుమారు 155 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్‌లో ఉన్న కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అధికారులు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నేతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు వీలైనంత తొందరగా వారికి రావాల్సిన ప్రయోజనాలను అధికారులు అంద జేయా లన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత , ప్రసన్న లక్ష్మి , మరేడ్ పల్లి ,ముషీరాబాద్ తహసీల్దార్లు అశోక్, గోవర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

### బీపీఈడీ, డీపీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 9లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 10 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

### రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్‌ఎల్‌బీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 18లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 31లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సమస్యల పరిష్కారం కోసం..

చిక్కడపల్లి : ప్రజా సమస్యల పరిష్కారంకోసం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాల మేరకు బాగ్‌లింగంపల్లి సూర్యనగర్ బస్తీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

# ఎల్వోసీ పత్రం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

మారేడ్‌పల్లి, జూలై 2 :సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఒక వరం లాంటిదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన నందిని జాదవ్ అనే మహిళకు శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 2 లక్షల 10 వేల ఎల్ఓసీని మంగళవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ కంటోన్మెంట్ లోని అర్హులైన లబ్ధిదారులందరికీ అందే విధంగా తన వంతు కృషి చేస్తామన్నారు.

# కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించండి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: వివిధ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు కౌన్సిలింగ్ షెడ్యూల్డ్ ప్రకటించాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎడ్‌సెట్, లా సెట్, పీజీ ఈసెట్, ఐసెట్, పీసెట్ తదితర ప్రవేశ పరీక్షలు ఫలితాల విడుదలై రోజులు గడుస్తున్నా ఇంతవరకు వివిధ కోర్సుల ప్రవేశాలకు కౌన్సిలింగ్ తేదీలను ప్రకటించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో ప్రవేశాలకు ర్యాంకులు వచ్చిన విద్యార్థులు ఎదురుచూస్తున్నారని అన్నారు.

ప్రవేశాలలో జాప్యం వలన విద్యాసంవత్సరం రెండు, మూడు నెలలు వెనుకబడి, వార్షిక పరీక్షలను వేసవి కాలంలో నిర్వహించడంతో విద్యార్థులు ఎండవేడిని తట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యామండలి అధికారులు వెంటనే స్పందించి కౌన్సిలింగ్ తేదీలను ప్రకటించాలన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

## భూగర్భ డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే శ్రీ గణేశ్



రెండో వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్,బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

బొల్లారం,జూలై 2:ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు.మంగళవారం కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని ఇందిరమ్మ నగర్ బస్తీలో రూ.40 లక్షల వ్యయంతో జేకే లైన్,భూగర్భ డ్రైనేజీ పనులకు బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ.. బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్టాటజిక్ నాలాను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేసి బస్తీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,బస్తీ వాసులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల ఆకలి తీరుస్తూ..


## సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న బల్కంపేట వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న కూతురు నర్సింహ, చిత్రంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి తదితరులు

అమీర్‌పేట్, జూలై 2 : అశేషంగా తరలివచ్చే భక్తుల ఆకలి తీర్చి.. అక్కున చేర్చుకునే గొప్ప మనసు బల్కంపేట వాసులదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు బల్కంపేటకు వస్తున్న భక్తులను తమ బంధువులుగా భావిస్తూ, వారి ఆకలి తీర్చేందుకు అల్పాహార, అన్నప్రసాద వితరణ శిబిరాలు ఏర్పాటు చేస్తూ చక్కటి సంప్రదాయాన్ని కొనసాగిస్తుండడం ఆదర్శమన్నారు. కూతురు భూమయ్య మల్లయ్య వంశవృక్షం అధ్యక్షులు, ఎల్లమ్మ దేవాలయ పాలక మండలి మాజీ సభ్యులు కూతురు నర్సింహ కొన్ని సంవత్సరాలుగా కళ్యాణం రోజున భక్తుల కోసం ఇక్కడి పాత ఎక్సైజ్ స్టేషన్ ఎదురుగా అల్పాహార శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాన్ని ప్రారంభించాల్సిందిగా కోరుతూ మంగళవారం ఉదయం కూతురు నర్సింహ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఉదయం 4 నుంచి క్యూలైన్లలో వేచి ఉం టూ, ఎల్లమ్మ అమ్మవారి దర్శనం చేసుకుని వచ్చే భక్తులకు ఉచిత అల్పాహార శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

# రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయండి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బన్సీలాల్‌పేట్, జూలై 2 : పద్మారావునగర్‌లోని అంతర్గత వీధుల్లో రోడ్లపై ప్యాచ్ వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల పలు కాలనీలలో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేశారని, రోడ్ల పై ప్యాచ్ వర్క్ చేయకపోవడం వలన వానలకు మట్టి కొట్టుకుపోయి కంకర తేలిందన్నారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎస్.రాజు, బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉమేశ్‌లు ఆయనకు వివరించారు. స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. బీజేపీ నాయకులు ఎం.శ్రీనివాస్, కే.కృష్ణ, కిషన్, సెల్వరాజ్, శ్రీకర్‌లు పాల్గొన్నారు.

# విరాళం ప్రకటించిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే

సికింద్రాబాద్,జూలై 2 : బోనాల పండుగను పురస్కరించుకొని చిలకలగూడ లోని చారిత్రాత్మక కట్ట మైసమ్మ పోచమ్మ దేవాలయానికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ విరాళం ప్రకటించారు. ఆలయంలో పంచ రంగులకు కనీసం రూ.ఏడు లక్షల వరకు ఖర్చవుతాయని ఆలయ అధికారులు అంచనా వేశారు. పంచ రంగుల ఖర్చు కింద రూ.ఏడు లక్షల వరకు తన వ్యక్తిగతంగా విరాళంగా పద్మారావు గౌడ్ ప్రకటించారు. వెంటనే పనులను ప్రారంభించి, బోనాల పండుగ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# బీసీలకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి




మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి

కాచిగూడ, జూలై 2 : కేంద్ర ప్రభుత్వం బీసీలకు రాజ్యాంగ హక్కులను కల్పించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లల్లో రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో జనగణనలో కులగణన చేపట్టి, ప్రధాని తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. బీసీ సమస్యలను పరిష్కరించాలని త్వరలో దేశ వ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.సరోజ

చిక్కడపల్లి, జూలై 2 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి దాని సాధన కోసం పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేయాలని విద్యార్థులకు వక్తలు సూచించారు. బాగ్‌లింగంపల్లిలో అంబేద్కర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మారెడ్డి, కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, జాయింట్ సెక్రటరీ రమణ, ప్రిన్సిపాల్ భారతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దు

హిమాయత్‌నగర్, జూలై 2: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

### లిఫ్ట్‌లో పడి పూజారి మృతి

అడ్డగుట్ట, జూలై 2 : ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో పడి ఓ పూజారి మృతిచెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఆంజనేయులు కథనం ప్రకారం.. ఈస్ట్ మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన ప్రీతమ్ తల్లి సంవత్సరిక పూజా కార్యక్రమానికి బోడుప్పల్‌కు చెందిన నర్సింహ మూర్తి అనే పూజారి వాళ్ల ఇంటి కొచ్చాడు. ఇప్పటివరకు బాగానే ఉన్నా.. మంగళవారం ఉదయం ప్రీతమ్ ఇంటికొచ్చిన నర్సింహ మూర్తి లిఫ్ట్ రావడం కంటే ముందే గేట్ ఓపెన్ చేసి ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తుకారాంగేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొల్లారం,జూలై 2:అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై దుర్గా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బొల్లారం తోట ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహం లభ్యమైంది.స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ దవాఖానకు తరలించారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ,జూలై 2: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్ పీజీ, డిప్లొమా, ఫ్యాషన్, టెక్నాలజీ కోర్సులకు యువతులు, మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిఫ్ట్ డైరెక్టర్ కె.రాముయాదవ్ తెలిపారు. నిఫ్ట్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కోర్సులకు డిమాండ్ ఉందని బొటిక్స్ రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వివరాలకు 903061 0011 / 55లో సంప్రదించవచ్చని తెలిపారు.

# అసాంఘిక శక్తులపై దృష్టి పెట్టండి

అమీర్‌పేట్, జూలై 2 : బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి అశేషంగా తరలి వచ్చే భక్తుల చాటున అసాంఘిక శక్తులు కూడా యధేచ్ఛగా సంచరిస్తుంటాయని రాయల సేవా సమితి ఎస్ఆర్‌నగర్ అధ్యక్షుడు ఆర్.సి.కుమార్ ఎస్ఆర్‌నగర్ ఏసీపీ పి.వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. మద్యం, డ్రగ్స్ మత్తులో వీరు సృష్టించే బీభత్సం భక్తులతో పాటు చుట్టుపక్కల కాలనీ వాసులకు కూడా ఇబ్బందికర పరిస్థితులు తెచ్చిపెడుతోందన్నారు. గత సంవత్సరం కల్యాణం రోజున చోటు చేసుకున్న ఘర్షణలు వ్యక్తుల కత్తి పోట్లకు దారి తీసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో జోగుతున్న యువకులను కట్టడి చేసేందుకు దేవాలయ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలంటూ తాము చేసిన సూచనకు ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు సానుకూలంగా స్పందించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లకు వినతి ప్రతాలు సమర్పిస్తున్న రాయల సేవా సమితి ప్రతినిధులు






జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎనిమిదో వార్డు రిసాల బజార్ దవాఖానలో వైద్యులు కేఎస్.శంకర్ రావుకు యాదవ సంఘం,ఆదర్శ నగర్ అసోసియేషన్ వాసులు శుభాకాంక్షలు తెలియజేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం వైద్యులు శంకర్ రావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రోహన్,నాగేష్ యాదవ్,ఈఆర్ బాల్‌రాజు పాల్గొన్నారు.

### అభినందనలు

ఒకటో వార్డు బోయిన్‌పల్లి వీఆర్ దవాఖాన వైద్యులను,సిబ్బందిని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ మంగళవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వైద్యుల సేవలు మరువలేనివన్నారు. అందుకే వారిని ప్రత్యక్ష దేవుళ్లు అన్నారు. – బొల్లారం,జూలై 2:

# ఉన్నా.. ఉపయోగంలో లేని బీసీ బాలుర హాస్టల్


- ఈ విద్యాసంవత్సరం కూడా ఒక్కరూ చేరని వైనం
- ఆకస్మిక తనిఖీలో విస్తుపోయిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
- అధికారుల తీరుపై అసహనం..

గోల్నాక, జూలై 2 : అంబర్‌పేట నియోజకవర్గంలో వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వసుతుల కల్పన కోసం అటు ప్రభుత్వం.. నిర్వహణపై ఇటు అధికారులు పట్టించుకోక పోవడంతో విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ఫలితంగా ఈ విద్యాసంవత్సరం ఒక్కరూ కూడా హాస్టల్లో అడ్మిషన్ తీసుకోని దుస్థితి స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆకస్మిక తనిఖీలో వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గోల్నాక డివిజన్ వీరన్న గుట్టలోని ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2016 లో 5వందల గజాల ప్రభుత్వ భూమిలో నిర్మించిన భవనం దుస్థితి చూసి విస్తుపోయారు. తలుపులు లేని మరుగు దొడ్లు, శిథిలావస్థకు చేరిన గదులు, పూర్తిగా అపరిశుభ్రమైన వాతావరణాన్ని చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇక అక్కడ విద్యార్థులు కనిపించకపోవడంతో హాస్టల్ వార్డెన్‌ను ఆరాతీయగా ఈ విద్యాసంవత్సరం ఒక్కరు కూడా జాయిన్ కాలేదని చెప్పడంతో షాక్ తిన్నారు. మరి మీరేమి చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తన దృష్టికి ఎందుకు తేలేదంటూ నిలదీశారు. వెంటనే కలెక్టర్‌తో మాట్లాడి హాస్టల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు చేరేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు ప్రవీణ్ కుమార్, కిరణ్, రాములు పాల్గొన్నారు.



హాస్టల్లో వంటశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


### పీసీసీ అధికార ప్రతినిధిగా డాక్టర్ శివకుమార్ లాల్



డాక్టర్ శివకుమార్ లాల్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీ మధుయాష్కి

బన్సీలాల్‌పేట్, జూలై 2 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్, పీసీసీ అధికార ప్రతినిధిగా బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన డాక్టర్ ఎం.శివకుమార్ లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్, ఏఐసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. డాక్టర్ శివకుమార్ లాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పీసీసీ అధికార ప్రతినిధిగా నియామించినందుకు ధుయాష్కికి ధన్యవాదాలు తెలిపారు.

### పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి



బన్సీలాల్‌పేట్, జూలై 2 : పద్మారావునగర్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన పార్కులో జరిగిన ఎన్నికల్లో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మామిడి బాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్కు అభివృద్ధికి పాటుపడతానని, అందరిని కలుపుకుపోయి వాకర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బాల్‌రెడ్డి అన్నారు. రాబోయే మూడేండ్ల పాటు కొనసాగే ఈ నూతన వాకర్స్ అసోసియేషన్‌లో ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ లాయక్, ఉపాధ్యక్షులుగా చక్రధర్ యాదవ్, కే.శ్రీనివాస్, ఎం.విజయ్‌కుమార్, జోషిలా ఎమ్మా, కోశాధికారిగా కుషాల్ కుమార్, కార్యదర్శులుగా మధుసూదన్‌రెడ్డి, రమేశ్ కుమార్, భాస్కర్ గుప్త, గిరి, వివేక్, సత్యనారాయణలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

### ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

హిమాయత్‌నగర్: విద్యార్థులు ఉన్నత విద్య నభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని మాజీ కార్పొరేటర్ జె.హేమలతయాదవ్, బీఆర్ఎస్ పార్టీ నేత జె.బాబు యాదవ్ అన్నారు. మంగళవారం రాంకోఠిలోని శక్తి గణేశ్ ఆలయం ఆవరణలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు.